క్లుప్తంగా

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



నర్సంపేట రూరల్ : పట్టణంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు పోరెడ్డి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శానబోయిన ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ కొర్ర సారయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోడం సాంబయ్య జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పాత శ్యామ్ ప్రసాద్, మండల కార్యదర్శి శీలం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, డైరెక్టర్ డక్క శ్రీనివాస్‌లను కాంగ్రెస్ పార్టీ గురిజాల గ్రామ కమిటీ నాయకులు గురువారం శాలువాతో సన్మానించారు. తొలుత పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గురిజాల గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం అచ్చయ్య, నాయకులు గజ్జి రాజు, బండారి చందర్‌రావు, గొడిశాల శ్రీనివాస్, కంకాల ఓనప్ప, చెల్పూరి నర్సయ్య, గాదె సాంబయ్య, కొత్త శ్రీనివాస్, బండారి మంజుల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని న్యూ విజన్ హైస్కూల్ విద్యార్థులు జగన్, రాంచరణ్, రాజేందర్ ఇటీవల వరంగల్‌లో జరిగిన తెలంగాణ రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్–14 విభాగంలో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మహిపాల్‌రెడ్డి పత్రికలకు వివరాలు వెల్లడించారు. ఈనెల 27, 28 తేదీల్లో హర్యానాలో జరగనున్న జాతీయ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సదరు విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ పోరెడ్డి నర్సింహారెడ్డి, మోతె రాజు, పీఈటీలు రాజేందర్, శ్రీధర్ పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు.

పరామర్శ



రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటకు చెందిన తోట జనార్దన్ ఇటీవల గేదె దాడిలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి బియ్యం సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మైస సురేశ్, నాయకులు సమ్మెట సుధీర్‌గౌడ్, సిలివేరు శ్రీధర్, ఐత ప్రవీణ్‌కుమార్, మహమ్మద్ అన్వర్, వంశీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మృతుడి అల్లుడు గాండ్ల రమేశ్ మిత్రులు రూ.5 వేల సాయం అందించారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి పూలు చల్లి నివాళులర్పించారు. బురహాన్‌పల్లిలోని దేవేందర్ నివాసంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, ఖాజామియా, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు నయీమ్, నాయకులు కోదాటి దయాకర్‌రావు, యాదగిరెడ్డి, గజవెల్లి ప్రసాద్, కొమ్ము రాజు, అశ్రఫ్ పాషా పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



రాయపర్తి : సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రైతు సంక్షేమమే ధ్యేయం

- ఊరూరా 'రుణమాఫీ' సంబురాలు
- ఎమ్మెల్యేలు, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. రైతులకు రుణమాఫీ చేస్తూ సీఎం ప్రకటించిన క్రమంలో జిల్లాలోని అన్ని మండలాల్లో ఊరూరా రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఎమ్మెల్యేల, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను రైతు వేదికల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వీక్షించారు.

–సాక్షి నెట్‌వర్క్



పర్వతగిరి : క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



సంగెంలో..



నెక్కొండలో..



దుగ్గొండి : రేబల్లెలో..

ఎన్నికల హామీల అమలుకు పోరాడాలి

నర్సంపేట : గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై గ్రామస్థాయి నుంచి పోరాడాలని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ధర్మారంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని రాణాప్రతాప్‌రెడ్డి పూలబోకే అందించి సన్మానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి శ్రేణులతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై పోరాటాలు నిర్మించాలని సూచించారు. తద్వారా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనల ఉల్లంఘన

నర్సంపేట రూరల్ : పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని బీఆర్‌ఎస్‌వీ డివిజన్ నాయకులు సదరం వినయ్ తెలిపారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌వీ పట్టణ కమిటీ అధ్యక్షుడు దేవోజు హేమంత్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడారు. పలు ప్రైవేట్ స్కూళ్లు కొత్తగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తూ, వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయని తెలిపారు. అధిక వసూలు వసూలు చేయడంతోపాటు యూనిఫారాలు, పుస్తకాల విక్రయాల పేరిట తల్లిదండ్రులను దోచుకుంటున్నారని చెప్పారు. అయినా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్కూళ్లలో యూనిఫారాల, పుస్తకాల విక్రయం నిబంధనలకు వ్యతిరేకమని ఉదహరించారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు శ్రీకాంత్, రమేశ్, రాజు, పవన్, శ్రీను, రజిత, అఖిల, అనిత, సునీత, పావని, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతు

చెన్నారావుపేట : ఎమ్మెల్యే చొరవతో మండలంలోని పాపయ్యపేటకు వెళ్లె రోడ్డుకు గురువారం మరమ్మతు పనులు గురువారం చేపట్టారు. తిమ్మరాయి నిపహాడ్ క్రాస్ నుంచి పాపయ్యపేట వరకు రోడ్డు గుంతలమయమై ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే స్పందించారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశించడంతో నాయకులు కంకర, డస్ట్ పోయించి మరమ్మతు చేయించారు.



గుంతల్లో కంకర పోయిస్తున్న నాయకులు

ఘనంగా తీజ్



దుగ్గొండి : మండలంలోని మంగలితండాలో తీజ్ వేడుకలను లంబాడీలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీత్లా భవాని పండుగ అనంతరం గిరిజనులు మంచెను ఏర్పాటు చేసి దానిపై షిబ్బిపై మట్టి వేసి అందులో గోధుమలు వేసి 9 రోజుల పాటు మంచె వద్ద ప్రత్యేకంగా పాటలు పాడుతూ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చివరి రోజు ఏపుగా పెరిగిన గోధుమ బుట్టలను తీసుకెళ్లి ఊరి చివర ఉండే చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద ధరావత్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కు మహనీయుల చిత్రపటాల బహూకరణ



గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి మహనీయుల చిత్రపటాలను గురువారం బహూకరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల చిత్రపటాలను ఆయన పంపించగా స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు హెచ్‌ఎం పట్టాభికి అందజేశారు. విద్యార్థులకు స్ఫూర్తినందించేలా చిత్రపటాలకు అందించిన బాలకిశోర్‌రెడ్డి చొరవను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లో చేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాంబాబు, నాయకులు

నల్లబెల్లి : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లోకి మార్చాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పాండవుల రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడచినా హామీలను అమలు చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దామ సాంబయ్య, గోనెల పద్మ, గుండాల శ్రీశైలం పాల్గొన్నారు.

సంగెం : ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నీరటి సదానందం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సదానందం మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనకబడినట్టు తెలిపారు. తొలుత మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, యువత అధ్యక్షుడు అమర్‌చంద్, మండల కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నిమ్మనమోయిన అయిలయ్య, బోనాల భగత్, చాగంటి యాకయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు బలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

ఖానాపురం : మాదకద్రవాల వినియోగంతో జీవితాలు బలయ్యే ప్రమాదం ఉందని నర్సంపేట రూరల్ సీఐ వేణుగోపాల్ స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల వినియోగంపై గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్తు అంధకారమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల మత్తులో యువత చేయకూడని తప్పులు చేసే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాంతం బాధపడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చెప్పారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో సైబర్ క్రైమ్ నానాటికీ పెరుగుతోందని తెలిపారు. నేరగాళ్లు కొత్తకొత్త రకాల మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకుండా సమాజం చైతన్యవంతమైతేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని తేటతెల్లం చేశారు. మొబైల్‌ల్లో అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, సైబర్ క్రైమ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ క్రైమ్ బాధితులు ఏమాత్రం జాప్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని చెప్పారు. సమావేశంలో ఎస్సై రఘుపతి, సిబ్బంది రవీందర్, ఎర్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభ్రతతో రోగాల నుంచి రక్షణ



ఖానాపురం : పరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతి



రాయపర్తి : వర్ధన్నపేటలో..

ఖానాపురం : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి తెలిపారు. మండలంలోని బుధరావుపేట, రంగాపురం, మంగళవారిపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ జ్యోతి మాట్లాడారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు, తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. సమాజంలోని ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్లలోకి, పరిసరాల్లోకి ఈగలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అన్ని గదుల్లోనూ శుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బాలలు, విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులు, కాళ్లు శుభ్రం కడుక్కుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కల్పన, రుచిత, సతీశ్, వైద్యసిబ్బంది రామలింగయ్య, భాస్కర్, జ్యోతి, భవాని, కనకలక్ష్మి, వినోద, రజిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిగడ్డలో..

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలోని ఫిరంగిగడ్డలో రాయపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఎంపీహెచ్‌వీ సువర్ణ, ఏఎన్‌ఎం మంజుల, ఆశా వర్కర్లు కల్యాణి, రమ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు భవనం నిర్మించాలి

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం అజయ్ మాట్లాడారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో శ్లాబ్ కురుస్తోందని, గోడలు తడిచి నాని కూలే అవకాశం ఉందని చెప్పారు. శిథిలమైన భవనం కూలితే విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు శ్యామ్, నాయకులు కల్యాణ్, రవి, రంజిత్, సుశీల్, పవన్, కల్యాణి, రజిత, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అజయ్, నాయకులు

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

ఖానాపురం : కాంగ్రెస్ నుంచి మండలంలోని ధర్మారావుపేట గ్రామానికి చెందిన గాలి దేవేందర్‌ను సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అధ్యక్షుడు కొన్కటి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవేందర్ పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడడంతోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏకాభిప్రాయంతో దేవేందర్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎవరు పార్టీ నిబంధనలు ఉల్లంఘించినా, తప్పుడు విధానాలు అనుసరించినా అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు కఠినంగా ఉంటాయని తెలిపారు. ఇక నుంచి పార్టీకి దేవేందర్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేసేదెప్పుడో?

- ప్రమాదాలకు నిలయం బ్రిడ్జి ప్రాంతం

ఖానాపురం : మండల కేంద్రం నుంచి పాకాల దిశగా వెళ్లే ఆయకట్టు దారిలోని బ్రిడ్జి వద్ద బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేదెప్పుడో..? అంటూ రైతులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఖానాపురం నుంచి పాకాల దిశగా ఆయకట్టు దారి ఉండగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే పంట పొలాలతోపాటు పాకాలకు వెళ్లడానికి అశోక్‌నగర్ శివారులోని ఆయకట్టు రోడ్డులో చేపట్టిన బ్రిడ్జి వద్ద మాత్రం బీటీ రోడ్డు వేయలేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనేక ఏళ్ల రైతుల కల నెరవేరినా బ్రిడ్జి వద్ద బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో రైతులు వేదనకు గురవుతున్నారు. పనులు అసంపూర్తిగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల ఓ వ్యాపారి ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలై లక్షలు వెచ్చించి ప్రాణాలు దక్కించుకున్నాడు. అనేక మంది బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదాల బారిన పడ్డారు. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు, అధికారులు స్పందించి బ్రిడ్జి వద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.



బీటీ వేయని రోడ్డు

పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని అప్పగించండి

- మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం

గాంధీఆస్పత్రి : మానవత దృక్పథంతో వ్యవహరించి పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా జారీ చేసిన ఆదేశాలను చిలకలగూడ పోలీసులు, గాంధీ మార్చురీ వైద్యు గురువారం అమలు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... వరంగల్‌కు చెందిన సాంబశివరావు–విశ్వరూప భార్యభర్తలు. కొన్ని రోజుల క్రితం సాంబశివరావు ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్ నగరానికి చేరుకుని గాంధీ ఆస్పత్రి మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై నివసిస్తూ కాలం వెళ్లదీస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. ఈ సందర్భంగా సాంబశివరావు బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిలకలగూడ సాంబశివరావు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఫొటోలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న సాంబశివరావు భార్య విశ్వరూప గాంధీ మార్చురీకి చేరుకుని భర్త సాంబశివరావు మృతదేహంగా గుర్తించారు. భర్త మృతిపై తనకు ఎటువంటి అనుమానాలు లేవని పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని అప్పగించాలని కోరగా, మార్చురీ వైద్యులు తిరస్కరించారు. మృతుడి భార్య విశ్వరూప సామాజిక మాధ్యమాల ద్వారా తన గోడును వెల్లబోసుకుంది. విషయం తెలుసుకున్న వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణమే స్పందించారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, చిలకలగూడ సీఐ అనుదీప్‌లకు ఫోన్ చేసి పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని అప్పగించాలని సూచించగా వారు మంత్రి ఆదేశాలను అమలు చేశారు. మంత్రి రాజనర్సింహ ఆదేశాల మేరకు పోస్టుమార్టం నిర్వహించకుండా సాంబశివ రావు మృతదేహాన్ని భార్య విశ్వరూపకు అప్పగించామని చిలకలగూడ సీఐ అనుదీప్ తెలిపారు.